# మెట్రో రైల్‌తో 'ఓల్డ్ సిటీ'కి మహర్దశ

ప్రభావిత ఆస్తుల యజమానులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మెట్రో ఎం.డి.ఎన్‌వీఎస్ రెడ్డి

మెట్రో నిర్మాణానికి మనఃస్ఫూర్తిగా సహకరిస్తాం : ఎంపి అసదుద్దీన్ ఒవైసీ




ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు కీలకమైన అడుగులు పడ్డాయి. ఎంజిబిఎస్ చాంద్రాయణ గుట్ట మార్గంలో ప్రభావిత 34 ఆస్తులకు సంబంధించిన 41 మంది యజమానులకు రూ. 20 కోట్ల నష్టపరిహారాన్ని ప్రభుత్వం సోమవారం చెల్లించింది. లక్డీకాపూల్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం చెక్కుల పంపి ణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ, హెచ్‌ఎంఎల్ ఎం.డి.ఎన్‌వీఎస్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిసెట్టి పాల్గొన్నారు. పాతనగరంలో మెట్రో రైల్ నిర్మాణం కోసం ఆస్తులు కోల్పోయిన వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సముచితమైన రీతిలో నష్టపరిహారాన్ని చెల్లిస్తున్నామని, ఈ ప్రక్రియలో ఎంపి అసదుద్దీన్ ఒవైసీ సూచనలను పరిగణలోకి తీసుకున్నామని ఎన్‌వీఎస్ రెడ్డి తెలిపారు.

**చార్మినార్ పరిసరాల్లో స్కైవాక్‌ల నిర్మాణం..**

మొదటి దశ కన్నా మరిన్ని సౌకర్యాలతో రెండో దశ నిర్మాణం చేపట్టనున్నామని, దీనిలో పాతనగరం రూపురేఖలు మారనున్నాయన్నారు. ఎంపి సూచనల మేరకు మెట్రో స్టేషన్‌ల నుండి చార్మినార్, లాడ్ బజార్, సాలార్ జంగ్ మ్యూజియం వంటి పర్యాటక ప్రాంతాలకు స్కై వాక్, ఫుట్ పాత్ మొదలైన అధునాతన సౌకర్యాలు సమకూరుస్తామని వెల్లడించారు. పాత నగరం ఇంకా అభివృద్ధి జరగాలని సిఎం ఆకాంక్ష అన్నారు. అందుకు తగ్గట్టుగా మెట్రోను పాతనగర వాసులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మొత్తం రు.2,741 కోట్ల అంచనా వ్యయంతో ఏడున్నర కిలోమీటర్ల పాతనగరం మెట్రోను నాలుగేళ్లలో పూర్తి చేయాలన్న సిఎం సంకల్పాన్ని నెరవేర్చడానికి సన్నద్ధం అయ్యామన్నారు. నాంపల్లిలో అధునాతన మల్టీ లెవెల్ పార్కింగ్ ప్రాజెక్టు కూడా వచ్చే నెలలో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, ఇది కూడా పాతనగర అభివృద్ధికి ముఖద్వారం అవుతుందన్నారు.

**నిర్వాసితులకు వ్యాపారాలకు అవకాశం ఇవ్వాలి: అసదుద్దీన్ ఒవైసీ..**

ఎంపి ఒవైసీ మాట్లాడుతూ ఎంతో కాలంగా ఓల్డ్ సిటీ వాసులు ఎదురు చూస్తున్న మెట్రో రైల్ ఇప్పుడు ఆచరణలోకి రావడం ప్రశంసనీయమని, ఇందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మెట్రో ఎం.డి. ఎన్‌వీఎస్ రెడ్డి చేస్తున్న కృషికి తాము సహకరిస్తామని హామీనిచ్చారు. ప్రతిపాదిత మీరాలం మండి, చార్మినార్ స్టేషన్‌ల వద్ద స్కై వాక్‌లను నిర్మిస్తే పర్యాటక పరంగానే కాకుండా స్థానికులకు కూడా సౌలభ్యంగా ఉంటుందని ఆయన సూచించారు. నిర్వాసితులకు, రాబోయే మెట్రో స్టేషన్ల వద్ద వ్యాపారాలు పెట్టుకోడానికి తగు ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా ఒవైసీ విజ్ఞప్తి చేశారు.

**లాభాదాయకమైన నష్టపరిహారం ఇస్తున్నాం**

**: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిసెట్టి**

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిసెట్టి మాట్లాడుతూ మెట్రో రైల్ ప్రాజెక్టు కోసం ముందుకు వచ్చిన నిర్వాసితులకు లాభదాయకమైన నష్టపరిహారాన్ని నిర్ణయించామని, దీనిని అందరు ఆహ్వానించారని తెలిపారు. మొత్తం 1100 ఆస్తులకు సుమారు రూ.1,000 కోట్ల నష్టపరిహారం చెల్లించనున్నామని, ఇందుకు స్థానికులు తమకు పూర్తిగా సహకరిస్తున్నారని జిల్లా కలెక్టర్ చెప్పారు. మెట్రో రైల్ భూ సేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ కె.స్వర్ణలత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.